




*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఆమె

**డూప్లికేట్ తాళం చేతితో** తలుపు తీసుకుని చలపతి లోపలకి వచ్చాడు.

ఈటీవిలో వార్తలు చూస్తున్న జానకి టి.వి ఆఫ్ చేసి బెడ్‌రూములోకి వెళ్ళిపోయింది. చలపతి స్నానం చేసివచ్చి, టేబుల్ మీద హాట్‌పేక్‌లో సర్దిన భోజనాన్ని తిని వెళ్ళి జానకి పక్కన పడుకున్నాడు. ఆమె నిద్రపోవడం లేదని తెలుసు. కానీ పలకరించే ప్రయత్నం చేయలేదు. చిన్నగా నిట్టూర్చి కళ్ళు మూసుకుని నిద్రపోయే ప్రయత్నం చేసాడు.

మర్నాడు మధ్యాహ్నం పన్నెండు గంటలకి కొడుకు నుంచి ఫోన్ వచ్చింది. సాధారణంగా ఆదిత్య తనకి ఫోన్ చేయడు. ఒకవేళ చేసినా ఇంట్లో ఉండే సమయాల్లో చేస్తాడు. మరి అకాలంలో ఈ ఫోన్ ఏమిటి? కంగారు పడుతూ ఆన్ చేసాడు.

"నాన్నా! ఏమైంది మీకు? ఏం చేసారు?" ఆది కంఠం కంగారుగా వినిపించింది.

"నేనేం చేసానురా?" అయోమయంగా అడిగాడు చలపతి.

"మీరేం చేయకపోతే అమ్మ అలా మెసేజ్ ఎందుకిస్తుంది?" కాన్ఫరెన్స్‌కాల్‌లో ఏడ్ అయిన కూతురు నిష్ఠూరంగా అడిగింది.

"అబ్బా! చంపక విషయం చెప్పండ్రా" చలపతి విసుక్కున్నాడు.

"అమ్మ మాకు పంపిన మెసేజ్ మీకు ఫార్వర్డ్ చేస్తున్నాను చూడండి పది నిమిషాల్లో మళ్ళీ చేస్తా" ఆదిత్య ఫోన్ పెట్టేసాడు.

మెసేజ్ వచ్చినట్లుగా ఫోన్ ఓసారి విజిల్ వేసింది ఆత్రంగా చూసాడు.

"మీ నాన్నకి విడాకులు ఇస్తున్నాను. ఓసారి రండి"

అది చూసేసరికి చలపతికి కాళ్ళూ చేతులు ఆడలేదు. తనే కొడుక్కి ఫోన్ చేసి దీనంగా అడిగాడు.

"ఏమిట్రా ఇది? నాకేం అర్థం కావడంలేదు. కొద్దిరోజులుగా జానకి నాతో పలకడంలేదు. కోపం వచ్చిందేమో తగ్గాక తనే మాట్లాడుతుందిలే అని ఊరుకున్నాను. సడన్‌గా ఇపుడీ మెసేజ్ ఏమిటి?"

''సరే నేను బయలుదేరుతున్నాను. చెల్లాయ్ ఆల్‌రెడి బస్‌లో ఉంది. అర్ధరాత్రికి చేరుకుంటాం. మీరు కంగారు పడకండి'' ఆదిత్య అనునయంగా చెప్పి ఫోన్ పెట్టేసాడు.

చలపతికి ఇంక పని చేయబుద్ధికాలేదు. హాఫ్‌డే సెలవు అడిగి ఇంటికి వచ్చేసాడు. జానకి ఇంట్లో లేదు ఆఫీస్ నుంచి ఎప్పుడు వస్తుందో? ఐదింటికా లేక ఆరుకా? అకస్మాత్తుగా అతనికి అనిపించింది - జానకి గురించి తనకేం తెలీదు అని.

కొద్ది సేపు టి.వి చూసాడు. తర్వాత తోచక ఇల్లంతా తిరిగాడు. పొందికగా శుభ్రంగా ఎక్కడి వస్తువులు అక్కడే ఉండి, తళతళలాడుతున్నాయి. ఉద్యోగస్తురాలై ఉండీ, జానకి ఇంటిని అంత బాగా సర్దినందుకు, ఉంచినందుకు మనసులోనే మెచ్చుకున్నాడు.

రైల్వేలో పనిచేసే చలపతికి, టెలిఫోన్స్‌లో పని చేసే జానకికి ఇరవై నాలుగేళ్ళ క్రితం పెళ్ళయింది. పెళ్ళిచూపుల్లో అమ్మాయి అందంగా ఉంది, ఉద్యోగం చేస్తుంది తప్ప చలపతి వేరే ఏమీ ఆలోచించలేదు తండ్రి చెప్పినట్లు బుద్దిగా పీటల మీద కూర్చున్నాడు.

పెళ్ళయ్యాక కొద్దినెలల్లోనే జానకి ఎంత సమర్ధురాలో తెలిసి, తల్లి తండ్రుల్ని మెచ్చుకున్నాడు, మంచి సెలక్షన్ అని. మరికొన్ని నెలల తర్వాత తన ఖర్చులకి కొంత ఉంచుకుని జీతం మొత్తం ఆమె చేతికే ఇచ్చి నిశ్చింతగా ఉండటం మొదలుపెట్టాడు. సంసార విషయాల్లో తామరాకు మీద నీటిబొట్టులా తప్పించి, కల్పించుకోవడం మానేసాడు.

పెళ్ళయిన మూడేళ్ళకి ప్రథమ సంతానం, తర్వాత రెండేళ్ళకి చివరి సంతానం ప్లానింగ్ అంతా జానికిదే. దేవుడంటే గుళ్ళల్లో ఉండేవాడు కాదు కనిపించే ప్రత్యక్షదైవాలు సూర్యచంద్రులు అని అబ్బాయికి ఆదిత్య అని, అమ్మాయికి సుధాంశ అని పేరు పెట్టింది. చలపతికి ఏ అభ్యంతరము కనపడలేదు.

అబ్బాయి డాక్టర్, అమ్మాయి ఇంజినీర్ అవ్వాలి, అదీ ఆంధ్రాలో కాదు అని, వాళ్ళతో రాత్రింబవళ్ళు కూర్చుని చదివించి ఆదిత్యకి మణిపాల్ మెడికల్ కాలేజీలో, సుధాంశకి సూరత్‌కల్ ఎన్.ఐ.టిలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరిగ్‌లో సీట్లు తెప్పించింది. దానికీ చలపతి కేవలం మౌన ప్రేక్షకుడే

హు! పిల్లలిద్దర్నీ కర్ణాటకకి అంకితం చేసినా ఒక్క మాట కూడా అనలేదు. అలాంటిది నాకు విడాకులిస్తుందా? చలపతి మనసులోనే వాపోయాడు. తలుపు చప్పుడైంది. చూస్తే జానకి. తలుపు మూసి లోపల నుంచి బోల్ట్ పెట్టి, అలసటగా సోఫాలో కూర్చుంది.

''నీ ఉద్దేశం ఏంటి అసలు?'' చలపతి దూకుడుగా అడగాలనుకున్నాడు కానీ అలవాటు లేక సౌమ్యంగా వినిపించింది.

సమాధానం చెప్పకుండా వెనక్కివాలి కళ్ళు మూసుకుంది జానకి. తన ప్రశ్నకి జవాబు రాదని గ్రహించిన చలపతి విసురుగా బయటకి వెళ్ళిపోయాడు. జానకి దీర్ఘంగా నిట్టూర్చింది.

రాత్రి లేట్‌గా రావడంతో చలపతికి ఎనిమిది గంటలకి కానీ మెలుకువ రాలేదు. వచ్చాక ఆరోజు ఆదివారం అని గుర్తొచ్చి మళ్ళీ పడుకుని పదింటికి లేచాడు. పిల్లలిద్దరూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని ఈనాడు ఆదివారం అనుబంధంలో గళ్ళనుడికట్టు పూర్తిచేస్తున్నారు. అది చూసిన చలపతికి కోపంతో పళ్ళుపటపటా కొరికాడు.

''ఒరేయ్! మీ అమ్మ నాకు విడాకులిస్తానని చెప్పినా, బుద్ధి లేకుండా ఆ పజిల్స్ పూర్తిచేయడం ఏమిట్రా?'' ఆక్రోశంగా అరిచాడు.

''దానికీ దీనికీ సంబంధం ఏంటి నాన్నా?'' కూతురు అయోమయంగా అడిగింది.

''నాన్నా! మధ్యాహ్నం భోజనాలయ్యాక మాట్లాడుకుందాం. అమ్మకి ఇవాళ డ్యూటీలేదు'' ఆదిత్య మృదువుగా చెప్పాడు.

భోజనాలయ్యాక నలుగురూ డ్రాయింగ్ రూంలో సమావేశమయ్యారు.

"ఇప్పుడు చెప్పమ్మా. ఉన్నట్లుండి ఇప్పుడెందుకు ఈ నిర్ణయం తీసుకున్నావు?" ఆదిత్య అడిగాడు

"నేను తనకి పల్లెత్తుమాట కూడా అనలేదు ఎప్పుడూ. ఇల్లు మీ అమ్మ ఇష్టానుసారమే నడుస్తోంది. నాకు పేకాట, తాగుడు, సిగరెట్లు కనీసం వక్కపొడి కూడా అలవాటు లేదు. జీతమంతా అమ్మకే ఇస్తాను. మరి నావల్ల కొత్తగా ఏం కష్టం వచ్చిందో కనుక్కోరా" ఉక్రోషంగా చెప్పాడు చలపతి.

"నాన్నా ప్లీజ్." సుధాంశ తండ్రిని వారించి తల్లిదగ్గరకి వెళ్ళి ఆమె భుజం మీద తలానించి కూర్చుంది.

"మీనాన్న చెప్పింది నిజమే. ఆయనకి ఏ వ్యసనాలు లేవు ఒక సినిమారంగం తప్ప." జానకి చెప్పింది.

"ఆ విషయం నీకు పెళ్ళయిన వెంటనే చెప్పాను. నువ్వూ సరే అన్నావు." చలపతి ఖండించాడు.

"నాన్నా ప్లీజ్.. అమ్మని చెప్పనివ్వండి." ఆదిత్య అర్థింపుగా చెప్పాడు.

"నిజమే చెప్పారు. చిన్నప్పుడు నాకు డాన్స్ కానీ, సంగీతం కానీ నేర్చుకోవాలని ఎంతో కోరికగా ఉండేది. కానీ మా నాయనమ్మ ఒప్పుకోలేదు. 'ఆ తైతక్కలు, కూనిరాగాలు మనకి కాదు నోర్మూసుకుని బడికి వెళ్ళి బుద్ధిగా చదువుకో.' అని తిట్టింది. బాగా గొడవ చేసాను. నిరాహార దీక్ష చేసాను. మా అమ్మా నాన్నలకి 'పోనీ నేర్చుకోనీ' అనిపించినా మా నాయనమ్మని ఎదిరించే ధైర్యం లేదు వాళ్ళకి. అలా నేను ఏ కలనీ నేర్చుకోలేకపోయాను. ఈ రోజుకీ టీ.విలో ఓ డాన్స్ ప్రోగ్రాం లేదా సంగీత కచ్చేరీనో వస్తే నాకు చాలా బాధగా ఉంటుంది నేర్చుకోలేదే అని.

"మా పెళ్ళయిన కొత్తల్లో మీ నాన్న అడిగారు, 'నాకు సినిమాలంటే చాలా ఇష్టం. వాటిలో చిన్నా చితకా వేషలు వేస్తూ ఉంటాను. అవేమీ అరనిమిషం కంటే ఎక్కువ సేపు తెరమీద కనిపించవు. వాళ్ళు నాకు రెమ్యునరేషన్ ఇవ్వరు, నేనూ అడగను. అది కేవలం నా హాబీ మాత్రమే. నీకు అభ్యంతరం లేదుకదా?' అని.

'నాకు మా నాయనమ్మ గుర్తొచ్చింది. 'వద్దు' అన్నందుకు నేను పడ్డ బాధ గుర్తొచ్చింది. అదీకాక నేను ఉద్యోగిని అనే ధైర్యం ఉంది. దాంతో 'సరే' అనేసాను. ఆ రోజు అలా ఒప్పుకున్నందుకు ఈ ఇరవైనాలుగేళ్ళుగా నన్ను నేను ఎంత తిట్టుకున్నానో?" జానకి ఓ నిమిషం ఆగింది.

సుధాంశ ఓదార్పుగా తల్లిచేతిని నిమిరింది.

"ఆయనది టెన్ టు ఫైవ్ జాబ్. ఐదు దాటితే ఇక ఆఫీస్ బాధ్యతలులేవు. ఆఫీస్ అవగానే అన్నపూర్ణ స్టూడియోకో, సారథీ స్టూడియోస్‌కో వెళ్ళిపోయేవారు. చిన్న చితక వేషాలు ఉంటే వేసేవారు. లేదా షూటింగ్ చూసే వాళ్ళు. రాత్రి ఏ పదింటికో ఇంటికి వచ్చేవారు. ఆదివారం వస్తే తొమ్మిది గంటలకల్లా వెళ్ళిపోయి రాత్రి పదికి వచ్చేవారు. నావి షిఫ్ట్ డ్యూటీస్. అర్ధరాత్రి షిఫ్ట్‌ల టైమ్‌లో నాతోటి ఎంప్లాయిస్‌ని వాళ్ళ భర్తలు డ్రాప్ చేసి, మళ్ళీ తెల్లవారు ఝామున పికప్ చేసేవారు. నేను ఓసారి నాన్నని అడిగాను. 'మీరు నన్ను డ్రాప్ చేస్తారా ఆఫీస్‌లో' అని. నేను అలసిపోయి నావల్లకాదు అని నిరాకరించారు. అది చెడ్డతనం కాదు, ఆయన నిజంగానే అలసిపోయారు. తన సరదా కోసం అలసిపోయారు. ఆ తర్వాత నేనెప్పుడూ మీ నాన్నని మళ్ళీ ఆ విషయం అడగలేదు. లోన్ తీసుకుని బైక్ కొనుక్కున్నాను. ఏ టైమైనా ధైర్యంగా వెళ్ళివస్తూండేదాన్ని."

"ఎప్పుడో జరిగినదానికి ఇప్పుడు విడాకులా?" చలపతి ఆశ్చర్యపోయాడు.

చిన్నగా నవ్వింది జానకి.

"ఈ ఇరవైనాలుగేళ్ళల్లో ఎన్నో పెళ్ళిళ్ళూ, ఫంక్షన్స్, పూజలు, పేరంటాలు, చావులు ఒక్కదానికీ ఆయన రాలేదు. ఆ సినిమా పిచ్చి వ్యసనమై పోయింది. పగలు ఆఫీస్, రాత్రి స్టూడియోలు. ఎవరు ఏ ఫంక్షన్‌కి పిలిచినా ఒక్కదాన్నే వెళ్ళేదాన్ని. చిలకాగోరింకల్లా కలిసి వచ్చే భార్యాభర్తలని చూసి బాధపడేదాన్ని. మీరు పుట్టాక మీ చదువుల వంక పెట్టుకుని నేనూ వెళ్ళడం మానేసాను. ఆయన ప్రతి ఫస్ట్‌కీ తన ఖర్చులకి ఓ ఐదారు వేలు ఉంచుకుని మిగిలిన జీతం అంతా నాకే ఇచ్చేస్తారు అక్కడితో తన బాధ్యత తీరింది, తను చాలా మంచి కుటుంబ పెద్ద అని ఆయన ఉద్దేశం. అన్ని అవసరాలు కేవలం ఆర్థిక అవసరాలే కాదు. డబ్బుతో సంబంధం లేనివి, డబ్బు తీర్చలేనివి కూడా ఉంటాయి. పిల్లలకి జ్వరాలు వచ్చినప్పుడు, వాళ్ళ చదువు సంధ్యల్లోనూ నాకు ఆయన నుంచి ఏ తోడ్పాటు, సహాయం అందలేదు. ఒక్క పేరెంట్స్ మీట్‌కి కూడా ఆయన రాలేదు. పిల్లలు గోల్డ్‌మెడల్స్ తీసుకుంటున్నారన్నా రాలేకపోయారు." జానకి దీర్ఘంగా నిట్టూర్చింది.

చలపతి ఆమె వంకే తదేకంగా చుస్తున్నాడు. కొత్త విషయాలు విన్నట్లుగా అతనిలో ఆశ్చర్యం కనబడుతోంది.

"మా ఇద్దరికీ ఎల్.టి.సి ఉంది. రైల్వే పాస్‌లు ఉన్నాయి. కానీ కలిసి ఎక్కడికీ ప్రయాణించలేదు. ఇంట్లో కూడా పట్టుమని పదినిమిషాలు కూర్చుని సాధక బాధకాలు మాట్లాడుకోలేదు. మీ చిన్నప్పుడు నాకు నైట్ డ్యూటీస్ ఉంటే ఎంత కంగారు పడేదాన్నో. పక్కవాళ్ళని బతిమాలి వాళ్ళింట్లో పడుకోపెట్టేదాన్ని. అందుకు ప్రతిఫలంగా మనింట్లోంచి ఎస్.టి.డిలు, లోకల్ కాల్స్ చేసుకోమని చెప్పేదాన్ని. వాళ్ళకి అవసరమైన రైల్వే రిజర్వేషన్స్ నాన్న చేత చేయించేదాన్ని. నోరు మంచిదైతే, ఊరు మంచిదవుతుందని, అందరితో సయోధ్యగా ఉంటూ నిభాయించుకొచ్చాను. ఇప్పటికి కొంత రిలాక్స్ అయ్యాను. మీరు వెళ్ళాక నాకు మరీ వంటరితనం అనిపించిందిరా. ఛ! ఏంటీ జీవితం అనిపించేది" జానకి కళ్ళనిండా కన్నీరు. చలపతి తలదించుకున్నాడు. కళాకారుడైన అతని సున్నిత హృదయం స్పందించింది. 'తనింత దూరం ఆలోచించలేదు' అనుకున్నాడు బాధగా.

"ఆయన తరఫు బంధువులకి నేను మొగుడ్ని కొంగుకి కట్టుకున్న జగజ్జాణని. మావాళ్ళకి రెండు జీతాలతో పైమెట్టు మీదున్నామనే పొగరుతో వాళ్ళిళ్ళకి వెళ్ళనిదాన్ని. వారు ఎవరేమనుకున్నా పట్టించుకోలేదు. కానీ, కానీ.. మొన్న.." జానకి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఏమైంది మొన్న?" ముగ్గురూ ఒకేసారి ఆత్రంగా అడిగారు.

"రేపు ఆదివారం త్యాగరాయ సభలో బాలమురళీకృష్ణ కచ్చేరీ ఉంది." శనివారం ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పాడు చలపతి.

"బాలమురళీకృష్ణా? నేను కూడా రావచ్చా?" జానకి ఉత్సాహంగా అడిగింది.

"నువ్వొస్తావా?" ఆశ్చర్యంగా అడిగాడు చలపతి.

"నాకు ఆయన కీర్తనలంటే చాలా ఇష్టం"

"ఆరుగంటలకల్లా వచ్చేయ్. కుదురుతుందా?" అడిగాడు.

"ఓ! వచ్చేస్తా"

అన్న ప్రకారం జానకి ఆరుగంటలకల్లా అక్కడికి చేరుకుంది. చలపతి హడావిడిగా వచ్చి ఆమెని తీసుకెళ్ళి రెండో వరసలో కూర్చోపెట్టి 'ఇప్పుడే వస్తా' అని చెప్పి వెళ్ళిపోయాడు. ఇంకా కచ్చేరీ మొదలవలేదు. స్టేజ్ మీద చలపతి హడావిడిగా తిరుగుతున్నాడు. కుర్చీలు సర్దాడు. మైక్ చెక్ చేసాడు. పూలదండలు పరిశీలించాడు. ముందుగా సభ ప్రారంభమైంది. ఓ మంత్రి కొందరు ప్రముఖులు వేదిక మీదికి ఎక్కి బాలమురళీకృష్ణ గానకౌశలాన్ని పొగిడారు. ఆ ఉపన్యాసాలు ముగిసేదాకా చలపతి స్టేజీ మీద ఓ మూల చేతులు

కట్టుకుని నిలబడ్డాడు. సభ ముగియగానే కర్టెన్ పడింది. చలపతి మళ్ళీ హడావిడిగా ఆ కుర్చీలన్నీ తీయడం, నేలమీద బాలీసులని పరిపించి మైక్‌లు సరిగ్గా ఉన్నాయో లేదో చెక్ చేయడం..' జానకి భర్తలోని ఈ కొత్త రూపాన్ని తొలిసారిగా చూసి నిర్ఘాంతపోయింది.

కచ్చేరీ మొదలైంది. ఓ అరగంట గడిచాక జానకి ముందు వరసలో కూర్చున్న ఇద్దరు మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. సంగీతంలో లీనమైపోయిన జానకి వాళ్ళవంక చిరాగ్గా చూసింది. వారిలో ఒకరు ఓ ప్రముఖ కేరక్టర్ నటుడు, మరొకరు ఓ చిన్న సైజు విద్వాంసుడు.

"నాలిక  పీకేస్తోందండి. ఈయన ఈ కళ్యాణి రాగాన్ని పీకేలోగా ఓ సిగరెట్‌ని నాలుగు పీల్పులు పీలుద్దాం అనుకుంటే సమయానికి జేబుఖాళీ" విద్వాంసుడు జీవన్మరణ సమస్యలాగా చెపుతున్నాడు.

"పబ్లిక్ ప్లేసుల్లో పొగతాగడం నిషిద్ధం అండీ" నటుడు నచ్చ చెప్పాడు.

"ఎదురుగా పెద్దాయన్ని పెట్టుకుని ఇక్కడ తాగుతానుటండీ? అలా బాత్ రూములోకి వెళ్ళి.." ఆయన నోటిమీద వేలు వేసుకున్నాడు.

"ఇప్పుడు మీకు సిగరెట్లు ఎవరు తెచ్చిస్తారు?" నటుడు అటూ ఇటూ చూసి ఉత్సాహంగా చెప్పాడు.

"అదిగో మన చలపాయ్ ఉన్నాడుగా!"

విద్వాంసుడితోపాటు జానకి కూడా అటువైపు చూసింది. చలపతి ఎలక్ట్రీషియన్‌తో ఏదో మాట్లాడుతున్నాడు.

"ఎవడండీ వాడు? మీకు తెలుసా?" విద్వాంసుడు రిలీఫ్‌గా అడిగాడు.

"చలపాయ్ అని ఓ సినిమా పిచ్చోడులే. ఎక్కడో ఉద్యోగం చేస్తాడు. సాయంత్రమైతే షూటింగుల్లో ప్రత్యక్షమౌతాడు. వాచ్‌మేన్ పాత్రో, కానిస్టేబుల్ పాత్రో ఏదో ఒకటి ఇచ్చి వాడి చేత గొడ్డు చాకిరి చేయించుకుంటారు. వీడు అదే నవ్వుమొహంతో పనులన్నీ చేసి పెడతాడు. మా పనులు చేయడం వాడి పూర్వజన్మ సుకృతంలాగా భావిస్తాడు. ఒరే అరే అన్నా ఏమనుకోడు. ఉండండి పిలుస్తాను. మీ సిగరెట్ల సమస్య సాల్వ్ అయినట్లే"

నటుడు చిన్నగా చప్పట్లు కొడుతూ చలపతి దృష్టిని ఆకర్షించాడు. చలపతి ఛెంగున స్టేజీ మీంచి దూకి రామభక్త హనుమాన్‌లా నటుడి ముందు మోకాళ్ళ మీద కూర్చుని గుసగుసగా అడిగాడు.

"నమస్కారం. ఏంటి సార్ పిలిచారు?"

"చూడు చలపతీ. మన ఘటంగారి సిగరెట్లు అయిపోయాయట. ఆయన చారుకేశి వింటూంటే, చార్మినార్ సిగరెట్లు గుర్తొస్తున్నాయట. ఎలా అని పాపం వాపోతూంటే నువ్వు కనపడ్డావ్" నటుడు పాత్రలో జీవిస్తూ చెప్పాడు.

"ప్రాసకోసం చార్మినార్ అన్నాను కానీ నా బ్రాండ్ విల్స్." విద్వాంసుడు చెప్పాడు.

"ఒక్క నిమిషం సార్." చలపతి వేగంగా వెళ్ళి, ఐదు నిమిషాల్లో వచ్చాడు. జేబులోంచి విల్స్ సిగరెట్ పేకట్ తీసి ఆయన కిచ్చి నటుడికి మరోసారి నమస్కరించి స్టేజ్ దగ్గరకి వెళ్ళిపోయాడు.

కచ్చేరి ముగిసాక చూస్తే జానకి లేదు. నైట్ డ్యూటీ ఏమో అనుకుంటూ ఇంటికి వచ్చిన చలపతికి సీరియస్‌గా తన పనులు చేసుకుంటున్న జానకి కనిపించింది.

"చెప్పకుండా వచ్చేసావ్? నీకోసం వెదికా తెలుసా?" చెప్పాడు. ఆమె మాట్లాడలేదు.

ఆ రాత్రి జానకి చలపతి వైపు తిరిగి కొంచెం సందేహంగా అడిగింది.

"నిద్రపోతున్నారా?"

"లేదు చెప్పు."

"నాకో మాట ఇస్తారా?"

"కొత్తగా ఏమిటి?" చలపతి ఆశ్చర్యపడ్డాడు.

"రేపటినుంచీ మీరు సినిమాలు, షూటింగులు అంటూ వెళ్ళొద్దు. ఆఫీస్ అవగానే ఇంటికి వచ్చేయండి. ఇంటిదగ్గర బోర్ అనుకుంటే, నేను వి.ఆర్ తీసుకుంటా."

"నేను పెళ్ళయిన కొత్తలోనే చెప్పా.." చలపతి చెప్పబోయాడు.

"..నిజమే. మాట మీద నిలబడడానికి మనం మహానుభావులమో, దేవతలమో కాదుగా. బలహీనతలున్న మనుషులం. ప్లీజ్. రేపటి నుంచీ కాదు. ఇవాల్టి నుంచీ మీరు ఆ సినిమాల జోలికి వెళ్ళొద్దు" ప్రాధేయపడింది.

"కుదరదు. నువ్వే అన్నావ్ బలహీనతలున్న మనుషులం అని. సినిమా నా బలహీనత." దృఢంగా చెప్పాడు చలపతి.

"అర్థమైంది. సినిమాలు మానుకోను అన్నాననా ఈ బ్లాక్‌మెయిల్?" చలపతి నిష్టూరంగా అడిగాడు.

"అవునా అమ్మా?" సుధాంశ సందేహంగా అడిగింది.

"అవును. ఆయన ఎవరు? రైల్వేలో ఒక పెద్ద ఆఫీసర్. నా భర్త. ఒక డిప్యూటీ కలెక్టర్‌కి అల్లుడు. ఓ కాబోయే డాక్టర్‌కి, ఇంజనీర్‌కి తండ్రి. మీచేత ఆయన్ని మీరు అనిపిలించాను. ఎవరికైనా చెప్పేప్పుడు 'మా నాన్నగారు' అని చెప్పాలి అని నేర్పించాను. ఎందుకు? రెస్పెక్ట్. గౌరవం. కానీ ఆయనకి సెల్ఫ్ రెస్పెక్ట్, ఆత్మగౌరవం లేదు అని ఆ రోజు అర్థమైంది. స్టూడియోలకి వెళ్తున్నారు వేషాలు వేస్తున్నారు అనుకున్నా కానీ ఇలా వాళ్ళకి జీతం భత్యం లేని పనివాడు అనుకోలేదు. సినిమాలు అనే ఆ బలహీనతకి ఎంత దిగజారిపోయారు అంటే, ఓ అణాకాణీ విద్వాంసుడికి సిగరెట్లు తెచ్చించేంత. ఇది నేను చూసింది. మరి ఇన్నేళ్ళుగా ఎంతమందికి ఏమే చేస్తున్నారో ఛీ! వద్దు. ఆత్మాభిమానం లేనివాడిని నేను భరించలేను." స్థిరంగా చెప్పింది జానకి.

పిల్లలు ఏం చెప్పలేక మౌనంగా ఉండిపోయారు.

"కిందటి ఆదివారం రాత్రి నాన్నని అడిగాను ఆ వ్యసనం మానేయమని. శనివారం దాకా చూసాను. ఆయన దినచర్యలో మార్పులేదు. నా మాటకి విలువలేదు. మొన్న ఆలోచించాను. ఈయన్ని వదిలేస్తే నాకేం నష్టం అని? నెలకి ఇచ్చే ఆ ఏభైవేలు తప్ప ఏమీలేదు. నా కష్టంలో, సుఖంలో ఎక్కడా ఆయన లేరు. భవిష్యత్తులో మీ పెళ్ళిళ్ళల్లో తప్ప ఆయన అవసరం లేదు. అవీ రాత్రిపూట పెళ్ళిళ్ళయితే రారు కూడా !. అలాంటప్పుడు సెల్ఫ్ రెస్పెక్ట్ లేనివాడిని భర్తగా రోజూ చూస్తూ భరించడం కంటే, వదిలేసి ప్రశాంతంగా ఉండొచ్చు అనిపించింది. మీకు చెప్పాలి కాబట్టి రమ్మన్నాను. ఇక నుంచి ఒక్క జీతం మీద మనం బతకాలి కాబట్టి కొంచెం ఖర్చులు తగ్గించుకోండి."

జానకి లేచి బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది.

పిల్లలిద్దరూ తండ్రి వైపు చూస్తూండిపోయారు – అతని స్పందన కోసం.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story